RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం , సెప్టెంబర్ 30 , 2026

# పోగొట్టిన సెల్‌ఫోన్.. నిజాయితీగా యజమానికి అప్పగింత

### - మానవత్వం చాటుకున్న కేశవపట్నం ఉపసర్పంచ్ ఏవీకే



**శంకరపట్నం, సెప్టెంబర్ 29: (తెలంగాణ వాణి)**
పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తనకు దొరికినా సొంతంగా ఉంచుకోకుండా పోలీసులకు అప్పగించి, యజమానికి తిరిగి అందేలా చేసిన కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ నిజాయితీని చాటుకున్నారు. కేశవపట్నం మండలం ఏరడపల్లి గ్రామానికి చెందిన ఊరటి రాజు తాడికల్ గ్రామంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అది విజయ్ కుమార్‌కు దొరకడంతో వెంటనే కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. అనంతరం ఏఎస్ఐ, ఏరడపల్లి సర్పంచ్ కొయ్యాడ అశోక్ సమక్షంలో సెల్‌ఫోన్‌ను యజమాని ఊరటి రాజుకు అందజేశారు. విలువైన వస్తువు దొరికినా ఆశపడకుండా, బాధ్యతగా పోలీసులకు అప్పగించి యజమానికి చేరేలా చేసిన విజయ్ కుమార్‌ను ఏఎస్ఐ, సర్పంచ్ అశోక్, స్థానికులు అభినందించారు. ఇతరులకు చెందిన వస్తువులు దొరికినప్పుడు వాటిని యజమానులకు తిరిగి అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# నారాయణ స్కూల్‌లో విద్యార్థి నేతృత్వంలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్





**నకిరేకల్ : సెప్టెంబర్ 29 (తెలంగాణ వాణి)**
నకిరేకల్ లోని మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ హై స్కూల్ నందు ఎల్కేజీ , యూకేజీ , ఒకటి మరియు రెండవ తరగతుల విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ , కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ విద్యా ప్రగతి , నేర్చుకున్న అంశాలు, ప్రతిభా సామర్థ్యాలను తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమక్షంలో స్వయంగా వివరించారు. విద్యార్థులు ఎంతో ప్రోత్సహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. చిన్నా రుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.
ఈ కార్యక్రమానికి డిజిఎం వెంకట్ రమణారెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్, వైస్ ప్రిన్సిపల్ హసీనా, ఉమామహేశ్వరి, ఏవో క్రాంతి కుమార్, కోఆర్డినేటర్స్ సునీత, హరీషా, మరియు తదితరులు ఎస్ ఎల్ సి కార్యక్రమానికి హాజరయ్యారు.

# స్నేహితులకు తీపిగుర్తుగా 45 ఏళ్ల నాటి ఫొటో

### ఆంధ్రా విశ్వవిద్యాలయం ఎం.కాం విద్యార్థుల అరుదైన జ్ఞాపకం




**కొత్తగూడెం, సెప్టెంబర్ 29 (తెలంగాణ వాణి):**
విద్యార్థి దశలో తీసుకున్న ఫొటోలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వి. సూర్య నారాయణ అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో 1979–81 బ్యాచ్‌కు చెందిన ఎం.కాం విద్యార్థుల 45 ఏళ్ల నాటి ఫొటోను ఆయన పత్రికా ప్రతినిధికి అందజేశారు. విద్యార్థి దశలో స్నేహితులతో కలిసి దిగిన ఫొటోను ఇన్నేళ్ల తర్వాత చూసుకోవడం ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఆంధ్రా విశ్వ విద్యాలయం కామర్స్ విభాగంలో ఎం.కాం పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనట్లు ఎస్.వి. సూర్యనారాయణ తెలిపారు. కాలగమనంలో స్నేహితులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడినా, ఇలాంటి ఫొటోలు నాటి స్నేహాలను, జ్ఞాపకాలను పదిలంగా ఉంచుతాయని పేర్కొన్నారు.

# రామచంద్రాపూర్ మండలంలో ఘనంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు









**రామచంద్రాపూర్, సెప్టెంబర్ 29: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రామచంద్రాపూర్ మండలంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు 28, 29, 30 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలను రామచంద్రాపూరం మండల ఎంఈఓ టీ. భాస్కర్ ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా గర్ల్స్ కబడ్డీ విభాగంలో విజేత జట్లు తమ ప్రతిభను చాటాయి. కబడ్డీ ఖ–14 బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ గ్రామ జట్టు ప్రథమ స్థానం, ఉస్మాన్ నగర్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. ఖ–17 బాలికల విభాగంలోజట్టు ప్రథమ స్థానం, ఉస్మాన్ నగర్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి.
మండలంలోని బీడీలు (ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు) సమన్వయంతో క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

# వికసిత్ భారత్ దిశగా విద్యార్థుల అడుగులు నాగారంలో మోదీ జన్మదిన వేడుకలు



### - కన్నులపండువగా 'సేవా సంకల్ప అభియాన్' చిత్రలేఖనం పోటీలు

**నాగారం, సెప్టెంబర్ 29 (తెలంగాణ వాణి) :**
విద్యార్థులలో దేశభక్తిని, భవిష్యత్తు భారత్ పట్ల ఆకాంక్షలను పెంపొందించే లక్ష్యంతో నాగారంలో 'సేవా సంకల్ప అభియాన్' వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్ సమక్షంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు పుడమి హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు.

**దేశ ప్రగతికి ప్రధాని మోదీ నిరంతర కృషి: జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతావనిని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచుతున్న ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ, దేశ ప్రజలందరూ ఆయనకు కృతజ్ఞతతో ఉండాలని పిలుపునిచ్చారు.

**'వికసిత్ భారత్–2047' సాధనే లక్ష్యం: కౌకుంట్ల చంద్రారెడ్డి**

మరో ముఖ్య అతిథి, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు 'వికసిత్ భారత్' ఇతివృత్తంపై గీసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని కొనియాడారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత శక్త్యుపేతమైన, అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు ఽ ముఖ్య నాయకులు:**

ఈ వర్ణరంజిత కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం శ్యామ్ సుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరం లక్ష్మి, జిల్లా కార్యదర్శి మరియు కన్వీనర్ బోడ శ్రీనివాస్, రాష్ట్ర మహిళా మోర్చా ఆఫీస్ కార్యదర్శి సంతోషి, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు రామారం మహేందర్ గౌడ్, బుధవరం వేణుగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు రవీందర్ రెడ్డి, జూపల్లి నరేష్, పెద్దిరెడ్డి వెంకట కనక ప్రసాద్, టెస్లా శ్రీనివాస్, బాలాజీ, నాగమల్లేశ్వరరావు, సతీష్, మధు గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.